



పోలా రామాంజనేయులు చిత్రపటం వద్ద నాయకుల నివాళి

రేపటి నుంచి 'అనంత'లో దులీప్‌ట్రోఫీ



మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు

ఇప్పటికే చేరుకున్న సి,డి టీమ్‌లు గ్రౌండ్‌లో నెట్ ప్రాక్టీస్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బిసిసిఐ తలపెట్టిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఇప్పటికే సి, డి టీమ్‌లు అనంతపురానికి చేరుకున్నాయి. సోమవారం రాత్రికి ఈ రెండు టీమ్‌లు అనంతపురం నగరానికి చేరుకున్నాయి. ఒక ప్రముఖ హోటల్లో ఆటగాళ్లు బస చేశారు. మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు టీమ్‌ల ఆటగాళ్లు ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సులోని అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీసు చేశారు. గురువారం ఉదయం సి, డి టీమ్‌ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎ, బి టీమ్‌లకు సంబంధించి మ్యాచ్ బెంగళూరు నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో జరుగనుంది. ఆ మ్యాచ్ అనంతరం ఆ రెండు టీమ్‌లు అనంతపురం నగరానికి చేరుకోనున్నాయి.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

అనంతపురం నగరంలో తొలిసారిగా జరుగుతున్న దులీప్‌ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను జిల్లా యంత్రాంగమూ పర్యవేక్షిస్తోంది. ఈ మేరకు దులీప్ ట్రోఫీ నిర్వాహక కమిటీ అధ్యక్షులు వినోద్‌కుమార్ మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ ఆటగాళ్లు అంతా విచ్చేస్తున్న సమయంలో పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చే అవకాశాలు కనిపిస్తుండటంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశమున్నందున ముందుగా పాసులను అందజేశారు. పాసులున్న వారిని మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. భద్రతా ఏర్పాట్లను జిల్లా పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. క్రికెటర్లకు భద్రతా ఏర్పాట్లతోపాటు జనసమూహం అధికంగా వచ్చే సమయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై సమీక్ష నిర్వహించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ప్రముఖ క్రికెటర్లు అందరూ వస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆటగాళ్లు బస చేసిన హోటళ్లుమొదలుకుని క్రికెట్ మైదానం వరకు అంతటా భద్రతా ఏర్పాట్లు చేశారు. అనుమతి ఉన్న వారికి తప్ప తక్కిన వారిని అనుమతించడం లేదు. మ్యాచ్ జరిగే ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సు చుట్టూ కూడా భద్రత కట్టుదిట్టం చేశారు. కాంప్లెక్సులోకి ప్రవేశించే ప్రధాన గేట్లను కూడా మూసివేశారు. నేటి నుంచి మరింత భద్రతను పెంచనున్నారు.

నగరంలో క్రికెట్ సందడి

ప్రముఖ ఆటగాళ్లందరూ విచ్చేస్తుండటంతో నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. ప్రధానంగా యువత, క్రికెట్ అభిమానులు క్రికెటర్లను చూసేందుకు ఎగబడుతున్నారు. వారు బస చేసిన హోటళ్ల ముందు పెద్దఎత్తున గుమిగూడి ఉంటున్నారు. ఆ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కూడా ఏర్పడుతోంది. ప్రాక్టీసు సమయాల్లో స్టేడియం సమీపంలోనూ ఇదే రకంగా జనసందోహం నెలకొంటోంది.

'పోలా' పోరాటాలు స్ఫూర్తిదాయకం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పోలా రామాంజనేయులు పోరాటాలు స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్ అన్నారు. పోలారామాంజనేయులు సంస్మరణ సభను స్థానిక ఎన్జీవో హోంలో మంగళవారం నిర్వహించారు. జంగాల పల్లి పెద్దన్న అధ్యక్షతన జరిగిన ఈ సభకు అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలా రామాంజనేయులు చేనేత కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటాల చేశారన్నారు. చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర కల్పించాలని, చేనేత సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వంతో పోరాడారన్నారు. చేనేత సమస్యలపై నిరంతరం అధ్యయనం చేసి ఆ సమస్యల పరిష్కారంలో పోలా పాత్ర ఎంతో ఉందన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని అన్నారు. చేనేత సమస్యలపై పోరాటాల సమయంలో పోలా రామాంజనేయులు జైలుకు కూడా వెళ్లిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. భాషా, సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ , ఆయుబ్ ఖాన్ , అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పోతక్క, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దాము, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, పోలా రామాంజనేయులు కుమారులు శీనా, గంగాధర్, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, చౌడప్ప, హరి, రమణ, బాలాజీ, ఖాదర్‌భాషా, సత్తి, అన్నం సూరి, హమాలీ వర్కర్స్ నేల కోటప్ప, అంగన్వాడీవర్కర్స్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

14, 15న అనంతలో జెవివి రాష్ట్ర వార్షిక మహాసభలు

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక మహా సభలు, అనంతపురం నగరంలో సెప్టెంబర్ 14,15 తేదీల్లో నిర్వహించనున్నట్లు జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జెవివి రాష్ట్ర వార్షిక మహాసభలకు సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నగరంలోని మూడవ రోడ్డు జిఆర్ పంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ మహాసభలను ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్(ఎఐపిఎస్ఎన్) మాజీ అధ్యక్షులు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ ప్రారంభించి 'శాస్త్రీయ దక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. ప్రారంభ సమావేశంలో, మాజీ ఎమ్మెల్సీ, శాసనమండలి మాజీ తాత్కాలిక చైర్మన్ వి.బాలసుబ్రమణ్యం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయా నంద్, జన విజ్ఞానవేదిక గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని ఉపన్యసిస్తారన్నారు. మొదటిరోజు మధ్యాహ్నం ప్రధాన కార్యదర్శి నివేదికను కుర్రా రామారావు, కోశాధికారి నివేదికను రాజశేఖర్ రాహుల్ ప్రవేశపెడతారన్నారు. విద్య వైద్యం పర్యావరణం శాస్త్ర ప్రచారం తదితర అంశాలపై, జెవివి కార్యాచరణ గురించిన చర్చ జరుగుతుందన్నారు. సాయంకాలం జరిగే సభలో, 'భారత రాజ్యాంగం–పౌర సమాజం పాత్ర' అనే అంశంపై, జెవివి నాయకులు, ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ వి బ్రహ్మారెడ్డి ఉపన్యసిస్తారని వివరించారు. రెండవ రోజు 15 తేదీ ఉదయం, 'రాష్ట్ర అభివృద్ధి–ప్రతిపాదనలు' అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ సదస్సులో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు ఉపన్యసిస్తారని ఈ సదస్సు తర్వాత ' శాస్త్ర ప్రచారంలో యువతరం, మహిళల పాత్ర'– అనే అంశంపై ప్రత్యేక సభ జరుగుతుందని చెప్పారు. మహాసభకు 26 జిల్లాల నుండి ప్రతినిధులు వస్తారని తెలిపారు.

విషజ్వరంతో బాలుడు మృతి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని పెద్ద బజారుకు చెందిన ఆరేళ్ల బాలుడు విష జ్వరంతో మృతిచెందాడు. పెద్ద బజారులో నివసిస్తున్న బెస్త రమణ, అనూష కుమారుడు దేవ(6) సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. దేవ రెండు రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం దేవ మృతిచెందాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమకుమారుడి మృతితో తల్లిదండ్రులు చేసిన రోదనలు కంట తడి పెట్టించాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి చెంది అనేకమంది విష జ్వరాల బారిన పడుతున్నట్లు ఆ కాలనీవాసులు వాపోతున్నారు.


పాము కాటుతో రైతు మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని నల్లగొండ రాయన పల్లికి చెందిన రైతు మంగళవారం పాముకాటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన రామ గోపాల్ (43) మంగళవారం పశువులకు గడ్డి కోయడానికి వ్యవసాయ పొలంలోకి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా అందులో ఉన్న పాము రామగోపాల్‌ను కాటు వేసింది. స్థానికులు బంధువులు రైతును పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య రమాదేవి, కుమారుడు తరుణ్, కుమార్తె చైతన్య ఉన్నారు. తరుణ్ రొద్దం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగా, కుమార్తె చైతన్య సొంత మండలంలోని కస్తూరి గాంధీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబం దిక్కులేనిది అయింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



వైసిసి సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

వైసిపి జిల్లా అధ్యక్షుల నియామకం

అనంతకు 'అనంత', సత్యసాయికి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌ను నియమిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సార్వత్రిక ఎన్నికల్ల ఘోర ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఈసమయంలో జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎవరు మోస్తారన్న చర్చ గత కొంతకాలంగా నడుస్తోంది. ఇప్పటికే రెండు జిల్లాల పాత అధ్యక్షులు పదవుల నుంచి తప్పుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షులుగానున్న పైలా నరసింహయ్య పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరియున్నారు. అంతక ముందు నుంచే అధ్యక్ష పదవి మార్పులపై చర్చ నడుస్తోంది. రాబోయే ఐదేళ్ల పార్టీని సమయన్వంతో నడిచే వారు ఎవరన్న అన్వేషణ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఆ పార్టీ చర్చ నడుస్తోంది. ఎందుకంటే పార్టీ ఘోర ఓటమి తరువాతి తిరిగి నిలబెట్టుకునేందుకు రాబోయే ఐదేళ్ల అధికార టిడిపి పై పోరాటం సాగించాల్సి ఉంటుంది. అది చేయాలంటే జిల్ల సమస్యలపై అవగాహన ఉండటంతోపాటు, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లే వారు అవసరమవుతారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అనంతపురం జిల్లాలో అనంత వెంకటరామిరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించినట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది. ఇక సత్యసాయి జిల్లాలో మరో నాయకులు మాజీ మంత్రి శంకర నారాయణ ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో ఆయన అనంతపురం పార్లమెంటు నుంచి పోటీ చేసియున్నారు.ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లాలో ఉన్న వారిలో మహిళకు ప్రాధాన్యతనిస్తే బాగుంటుందన్న ఉద్ధేశ్యంతో పెనుకొండ నుంచి ఈసారి బరిలో దిగిన మాజీ మంత్రి ఉషచరణ్ శ్రీకి ఆ బాధ్యతలిచ్చినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ పార్టీని ఏ రకంగా నడిపించగలరన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే ఇప్పటికే అక్కడున్న నేతలు పార్టీ కార్యాక్రమాల పట్ల పెద్దగా స్పందిస్తున్న దాఖలాల్లేవు. ఎన్నికల ఫలితాల నుంచి పెద్దగా కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. ఇటువంటి దగ్గరి అందరినీ ముందుకు నడిపించడం ఉషచరణ్‌శ్రీ పెద్ద భారమే కానుందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఘనంగా వీరభద్రస్వామి జయంత్యుత్సవం

లేపాక్షి : పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం జయంత్యుత్సవ వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-పరిగి

పశువులకు గర్భకోశ చికిత్సపై మంగళవారం పరిగిలో పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం, ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ టి.వి. సుధాకర్ పశు వులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, నట్టల నివారణ మందు తాపారు. పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. శిబిరంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ టివి.సుధాకర్, డాక్టర్ పెంచలయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సోమనాథ్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.గీతావాణి, ప్యారా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్లకు సన్మానం

నల్లచెరువు : ఆగస్టు 15వ తేదీ ఉత్తమ వార్డెన్ అవార్డు అందుకున్న లలితమ్మ, లక్ష్మీనారాయణలను మంగళవారం పుట్టపర్తి పట్టనంలోని బిసి సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో బి.మల్లేష్ అతని కుమారుడు బి.చారుహసన్‌తో కలిసి ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. వారు భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల వ్యాప్తంగా నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు అధ్యక్షతన ముదిగుబ్బ, నల్లమాడ, కొత్తచెరువు, కుటాగుళ్ల, తదితర మండలాల సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు, స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులతో పాటు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముందుగా వారు విద్యుత్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ చేపట్టి అరగంట పాటు రోడ్డుపై బైఠాయించారు. సత్యసాయి కార్మికుల జీతాలు చెల్లించి తాగునీటి సమస్యను పరిష్కరిం చాలని నినాదాలు చేశారు. అనంతరం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లారు. రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాస్తారోకో వల్ల జాతీయ రహదారిపై అరగంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ఆశా కార్యకర్తలతో సమీక్ష

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

శిశువుల పెరుగుదల, భవిష్యత్తు, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేసే 'పోషణ్ మా' బృహత్తర కార్యక్రమం తల్లులందరికీ గొప్ప వరం అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సమాచార అధికారి బాబాఫక్రుద్దీన్, వైద్యాధికారులు డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ కమల్ రోహిత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కుమారస్వామి రెడ్డి, ఆరోగ్య సిబ్బంది సుభాషిని, విజయకుమారి, దిల్షాద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

వినాయక చవితి పండుగ రోజున రసాయన పదార్థాలతో చేసిన ప్రతిమలను కాకుండా మట్టి గణపతిని పూజించి పర్యావర ణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఇదే విషయంపై స్థానిక సిద్ధార్థ విద్యానికేతన్‌లో 7వ తరగతి చదువుతున్న ప్రకృతి ప్రేమికుడు మాస్టర్ ఎం.చేతన్ ప్రజలను కోరుతున్నాడు. రసాయన పదార్థాలతో చేసిన గణపతిని నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై అందులోని జీవచరాలు మృతి చెందుతాయన్నారు. కావున ప్రతిఒక్కరూ మట్టి గణపతిని ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడాలని చేతన్ కోరుతున్నాడు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ పి.హబీబ్‌రెహ్మాన్ అధికారులకు పుస్తకాలు అందజేశారు. ఆయన డిఇఒ మీనాక్షి, తహశీల్దార్ నాగరాజు, అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ ఎంపి ఇందిరలను కలిసి పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ కమిటీ కార్యదర్శి బాలకృష్ణ, మండల అధ్యక్షులు ఏటూరి పోతలయ్య, కార్యదర్శి కాశీం, కొత్తచెరువు మండల కన్వీనర్ నూర్‌బాషా పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల భవనం

ప్రజాశక్తి-అగళి



భవనం పైకప్పు కడ్డీలు బయట పడిన దృశ్యం

మండలంలోని మధూడి గ్రామంలో ఉన్న పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం గోడలు నెర్రెలు చీలాయి. తరచూ పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీనికి తోడు ఇటీవల వర్షాలు బాగా కురవడంతో భవనం బాగా తడిచింది. దీంతో భవనం ఏ క్షణాన కూలుతుందోనని వైద్యులు, సిబ్బంది, పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కారుతుండడంతో పశువుల దాణా నిల్వ ఉంచడానికి ఇబ్బందులు పడుతున్నామని డాక్టర్ తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పశువుల ఆసుపత్రిని ఇంకో భవనంలోకి మార్చాలి లేదా నూతన భవన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాగునీటి పథకాలపై ప్రత్యేక శ్రద్ధ

డిపిఒ విజయ్ కుమార్



ట్యాంకును పరిశీలిస్తున్న డిపిఒ విజయ్ కుమార్, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ ఆదేశించారు.ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని పలు పంచాయతీల్లోని తాగునీటి పథకాలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రతిష్టాత్మకంగా పిఆర్ఐ అనే యాప్‌ను రూపొందించిందన్నారు. ఉన్నతాధికారులు సమీక్షించడానికి వీలుగా ఈ యాప్ ను రూపొందించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ఆయా పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిపిఒ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ నటరాజ్, పంచాయతీ కార్యదర్శులు కిరికెర ఇబ్రహీం, కొటిపి సుభాషిని, తూముకుంట కెంచరాయప్పతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రివైట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల నందు సెప్టెంబర్ 16వ తేదీ నుంచి సివిల్ రివైట్ (ఆర్కిటెక్చర్) అనే నూతన కోర్సు ప్రారంభించనున్నామని ఆకోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ఎన్ హరీష్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ కోర్సుకు ఐటిఐ, డిప్లమా మరియు ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ వారు సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకి 30 పరిమిత సీట్లు మాత్రమే ఉంటాయని, 1500 రూపాయలు ఫీజు, 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం 9441192027 ను సంప్రదించాలన్నారు.

అక్రమ తొలగింపులు ఆపండి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలో ఉన్న ప్రీకాట్ బి మిల్ లో కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలోని ఎఎల్ఒ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు వినోద్ కుమార్, డి బాబు, ప్రీకాట్ బి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మారుతీ రెడ్డి మాట్లాడుతూ మిల్లులో యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నోటీసులు ఇస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రీకాట్ 'బి' ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గంగాధర్, కోశాధికారి మాచప్ప, నాయకులు అలీమ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

క్షతగాత్రులను గార్మెంట్స్ కంపెనీలు ఆదుకోవాలి

కదిరి అర్బన్ : గార్మెంట్స్ కంపెనీలో పని ముగించుకొని తిరిగి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గార్మెంట్స్ కంపెనీ ఆదుకోవాలని సిఐటియు నాయకులు జిఎల్.నరసింహులు, ముస్తాక్, బాబ్‌జాన్, జగన్మోహన్, తాజుద్దీన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందు తున్న రోడ్డు ప్రమాద బాధితులను మంగళవారం సిఐటియు నాయకులు పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ క్షతగాత్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన, పేద ప్రజలకు తక్కువ వేతనం చెల్లించి ఎక్కువ పని చేయించుకుంటున్న గార్మెంట్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి కంపెనీ నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కదిరి ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేకపోవడం వల్లే సుదూర ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాజకీయ నాయకులు కదిరి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. సోమ, మంగళవారం రెండు రోజులు జరిగిన రోడ్డు ప్రమాదాలను ప్రస్తావిస్తూ ఆయా ప్రమాదాలకు కారణమైన అంశాలను పరిశీలించి, నివారించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పిహెచ్‌సిల తనిఖీ


వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఎంహెచ్‌ఒ మంజువాణి

మడకశిర : మండలంలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్ అధ్యక్షతన ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి ఈ నెలలో జరగబోయే పోషణ్ మా, 17వ తేదీ జరిగే జాతీయ నులిపురుగుల దినోత్సవంపై చర్చించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో సూపర్‌వైజర్ బి.రాణి, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. అలాగే ఎం.రాయపురం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఒ తనిఖీ చేశారు. అతిసార వ్యాధితో ఇటీవల రాయపురం గ్రామంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. దీంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను డిఎంహెచ్ఒ సందర్శించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట గుండుమల పిహెచ్‌సి డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తచెరువు రూరల్ : డిసెంబర్ 8వ తేదీ జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్ఎంఎంఎస్) రాసేందుకు ఈ నెల 17వ తేదీ వరకూ దరఖాస్తు గడువు పొడిగించినట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8 వ తరగతి చదివే విద్యార్థులు www.bse.ap. gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.5లక్షల లోపు ఉండాలన్నారు. వివరాల కోసం వెబ్‌సైట్ లేదా డిఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధాన పట్టణాల్లోని రహదారులు, కూడళ్లలో ఆయా పోలీస్ స్టేషన్ అధికారుల సమక్షంలో తనిఖీలు చేశారు. మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు చేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పక వాడాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, 100 డయల్‌పై పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు.

స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఇసుక

పుట్టపర్తి క్రైమ్ : జిల్లాలో ఉన్న మూడు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద 12,175 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రామ్మోహన్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 13,634 టన్నులు ఉండగా మంగళవారం 89 మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. వారికి 1,459 మెట్రిక్ టన్నుల ఇసుక పోనూ ఇంకా ఉప్పలపాడు, నల్లబోయినపల్లి, కొడవండ్లపల్లి స్టాక్ పాయింట్ల వద్ద 12,175 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. టన్ను ఇసుక రూ. 277 అని, అవసరమైన వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

పరిటాల రవి ఘాట్ వద్ద ఎమ్మెల్యే నివాళి

మడకశిర : రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఉన్న మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నివాళులర్పించారు. అనంతరం వారు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి తేలికపాటి వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కనగానపల్లి మండలంలో అత్యధికంగా 13.2 మిల్లీమీటర్లు, తాడిమర్రిలో అత్యల్పంగా 3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. బత్తలపల్లిలో 12.2, ధర్మవరంలో 4.4, గుడిబండలో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

హమాలీ కార్మికులను గుర్తించాలి


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఓబుళదేవరచెరువు : హమాలీ కార్మికులను ప్రభుత్వం గుర్తించాలని సిఐటియు మండల కన్వీనర్ కుళ్లాయప్ప, కో కన్వీనర్ శ్రీరాములు కోరారు. వారు మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద విలేకరుల సమావేశం లో మాట్లాడారు. రెండేళ్ల నుంచి దాదాపు 50 మంది కార్మికులు జీవనోపాధి కోసం బస్తాలు మోస్తున్నారని, వారికి కనీసం ఇల్లు కూడా లేవన్నారు. హమాలీ కార్మికుల సమస్యలపై పోరాడడానికి హమాలీ యూనియన్ ఏర్పాటు చేస్తున్నామని, దీన్ని గుర్తించి హమాలీ యూనియన్ కార్డులు ఇవ్వాలని కోరారు. హమాలీ యూనియన్ అధ్యక్షుడిగా ఎం.శివశంకర్, కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా ఎం.గంగాద్రి, ట్రెజరర్‌గా శ్రీనాథ్, కార్యవర్గ సభ్యులుగా రమణప్ప, బాలచిన్నప్ప, శ్రీనివాసులు, ఆదినారాయణ, తదితరులను ఎన్నుకున్నారు.

టిడిపిలో పలువురు చేరిక

అగళి : మండలంలోని గొల్లహట్టి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రామకృష్ణయాదవ్, గోవింద రాజ్, బల్లెకట్టప్ప, చిక్కన్న, పూజారి జోగన్న, తదితరులు మంగళవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి గుండుమల పసుపు కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కురుబ సాధికార సమితి కన్వీనర్ గోవిందప్ప, జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జయప్ప, తాలూకా బిసి సెల్ అధ్యక్షులు తిప్పేస్వామి, రాజగోపాల్, కెంచు యాదవ్, శివకుమార్, శ్రీనివాస్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.


గుండుమల సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సైబర్ నేరాలు, సాంఘిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్‌లను ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే అంశంపై డీఎస్పీ శ్రీలత విద్యార్థినులకు వివరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరస్తులు ఏ విధంగా ప్రలోభాలకు గురిచేస్తారో వివరించారు. రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి ఉపయోగించుకోవాలే కానీ చెడుకు ఉపయోగించి బానిస కాకూడదన్నారు. మంచి వాతావరణంలో మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చి గురువులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చేలా ముందుకు పోవాలని సూచించారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు మంచి అవకాశ మార్గాలు ఉన్నాయని వాటిని ఎంచుకోవడంలో తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తీసుకొని భవిష్యత్తుగా ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు బానిస కావద్దని, వాహనం జాగ్రత్తగా నడపాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి, ప్రశాంత్, కవిత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీలత

ఆశా వర్కర్ల సమస్యలపై సిఐటియు ధర్నా

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆశా వర్కర్స్ ఒప్పంద జీవో ప్రతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు వేతనాలు పెంచాలని గత ఫిబ్రవరి 9వ తేదీ సిఐటియు, ఆశా వర్కర్స్ రాష్ట్ర నాయకత్వంతో జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పంద జీవోలు కోరారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్ అదనపు పనులు, పని చేయని సెల్‌ఫోన్లు, తదితర సమస్యలతో మెజార్టీ ఆశాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆశా వర్కర్ల సమస్యలపై జిల్లాలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, ఒప్పంద జీవోలు వెంటనే ఇవ్వాలని, 60 ఏళ్లు నిండిన ఆశాలకు రిటైర్మెంట్‌ను జీవోల అమలు వరకు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, తులసి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : దర్శినమల పిహెచ్‌సిలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా డే నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ మాట్లాడుతూ కనీస వేతనం, పని భారం, ఉద్యోగ భద్రత, తదితర ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ప్రభుత్వంతో జరిపిన చర్చలకు సంబంధించి జిఒ ప్రతులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం సిఐటియు ఆధ్వర్యంలో డాక్టర్ దిలీప్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పుష్ప, బానుబి, సుశీలమ్మ, నాగలక్ష్మి, సావిత్రి, రాములమ్మ, నాగవేణి, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఆశా వర్కర్స్ వేతనాలు పెంపు, తదితర సమస్యలపై గత ప్రభుత్వం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీఓలు, సర్క్యులర్స్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ గంగాధర్‌కి వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా శ్రామిక మహిళా సంఘం సభ్యురాలు దిల్షాద్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు.


సిఐటియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ఎంపి పార్ధసారధి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో మంగళవారం టిడిపి శ్రేణులు హిందూపురం ఎంపి బికె పార్థసారధి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతపురం నుంచి వచ్చిన బికెకు స్థానిక టిడిపి నాయకులు దర్గా సర్కిల్‌లో గజమాలతో స్వాగతం పలికారు. అంబేద్కర్ కూడలిలో అభిమానులు బికె చేత 65 కిలోల భారీ కేక్‌ను కట్ చేయించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. బికెకు అడుగడుగునా స్వాగతం పలుకుతూ, బాణసంచా పేల్చి అభిమానం చాటుకున్నారు. అనంతరం బికె పట్టణంలోని తన కార్యాలయంలో అభిమానులు, టిడిపి శ్రేణుల మధ్య జన్మదిన వేడుకలు చేసు కున్నారు.

గోరంట్ల : ఎంపి బికె పార్థసారధి జన్మదినం సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, పార్లమెంటు కార్యదర్శి దేవ నరసింహప్ప ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు. 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు యువశేఖర్, నీలకంఠారెడ్డి, ఉమరాఖాన్, మరెడ్డిపల్లి నరసింహులు, రవిగంగాధర్‌రెడ్డి, డీలర్ గంగాధరప్ప, పుల్లేరు చంద్రారెడ్డి, లక్ష్మీనరసింహులు, నరేంద్ర, గంగిరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు


ఎంపి పార్థసారధికి గజమాల వేసి స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్


సూపరింటెండెంట్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో బాధ పడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఛైర్మన్ కదిరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కదిరి ఏరియా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కదిరప్ప మాట్లాడుతూ ఆసుపత్రికి రోజూ 500 మంది రోగులు వస్తుంటారన్నారు. అయితే ఆసుపత్రిలో సరైన మౌలిక సదుపాయాలు, రాత్రి వేళ విద్యుత్ సరఫరా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోగులకు పరీక్ష కిట్లు సమకూర్చాలని, సదుపాయాలు కల్పించాలని, ప్రతి మండల కేంద్రంలో ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గాలివీడు ఉపేంద్ర, భాస్కర్, తిప్పన్న, శ్రీనివాసులు, జనార్ధన్, నవీన్, బన్నీ, రాజేష్, త్రిలోక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయండి

ప్రజాశక్తి-కొత్తచెరువు


కో ఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఈ నెల 15వ తేదీ నుంచి విద్యార్థులకు నిర్వహించే క్రీడా పోటీలకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని డిఇఒ మీనాక్షి ఆదేశించారు. ఈ విషయంపై మంగళవారం డిఇఒ స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్‌లో జిల్లాలోని స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలు, 21 నుంచి నియోజకవర్గస్థాయి, 30వ తేదీ జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు, ఇందులో అండర్-14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, యోగా, చెస్ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. సమావేశంలో డివైఇఒ రంగస్వామి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ మొరంజి యాదవ్, పీఈటీలు ప్రభాకర్, శివకుమార్, రామకృష్ణ, వెంకటేష్, వేణుగోపాల్, సందీప్‌కుమార్, చంద్ర నాయక్, నాగేంద్ర పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

పుట్టపర్తి క్రైమ్ : వినాయక మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పట్టణ సిఐ సునీత తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక స్టేషన్‌లో గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. సిఐ మాట్లాడుతూ వినాయక మండపాలు పోలీస్ శాఖ నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగు పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జనం ఊరేగింపులో అల్లర్లకు పాల్పడవద్దన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


ఓబుళదేవరచెరువు : వివిధ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, కె.రామసుబ్బయ్య, ఎడి సత్యనారాయణ రైతులకు వివరించారు. మండలంలోని మామిళ్లకుంటపల్లి గ్రామంలో సాగు చేసి వేరుశనగ, కంది, మొక్కజొన్న పంటలను వారు మంగళవారం పరిశీలించి ఆయా పంటల్లో తెగుళ్ల నివారణ, దిగుబడి పెరిగేందుకు మందులు, ఎరువులను సూచించారు. వారి వెంట ఏవో ఇలియాజ్ మహమ్మద్, రైతులు ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

నల్లచెరువు : 2023-24కి సంబంధించిన ఉపాధి హామీ పనులపై మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ విజయప్రసాద్, క్లస్టర్ ఎపిడి రమేష్, ఎంపిడిఒ శకుంతల, ఎపిఒ మంజుల పాల్గొన్నారు. ఉపాధి, పంచాయతీ రాజ్ శాఖలో సర్వ శిక్ష అభియాన్ కింద రూ. 7,72,91,800 ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉపాధి హామీ కింద రూ. 15,819, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 14,360కు సంబంధించి రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పిడి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రాజకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, సీఆర్పీలు, డిఆర్పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ధర్మవరం రూరల్ : మండలంలోని రేగాటి పల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. అధికారులు కార్మికులతో మాట్లాడుతూ వారికి ఎన్ని పని దినాలు వుంటాయో వివరించారు. సిపిఎం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ కూలీలకు పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ, మజ్జిగ, ప్రాథమిక చికిత్సకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఎపిఒ అనిల్ కుమార్, టిఎ పుణ్యవతి, ఫీల్డ్ అసిస్టెంట్ జయరామిరెడ్డి ఉన్నారు.


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

నిమజ్జనం రోజున ట్రాఫిక్ మళ్లింపుపై డీఎస్పీ ఆరా

పరిగి : వినాయక చవితి సందర్భంగా నిమజ్జనం రోజున వాహనాల మళ్లింపునకు సంబంధించి పెనుకొండ ఇన్‌ఛార్జి డీఎస్పీ మహేష్ మంగళవారం జాతీయ హైవేను పరిశీలించారు. హిందూపురం కేంద్రంగా నిర్వహించే వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా వాహనాలను హిందూపురం ప్రాంతం నుంచి గ్రామీణ ప్రాంతాల వైపు మళ్లించే విషయంపై డీఎస్పీ హిందూపురం వన్ టౌన్ సిఐ రాజ గోపాల్ నాయుడుతో చర్చించారు. జాతీయ రహదారిపైకి చేరుకునే వాహనాల రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ముందస్తుగా రూట్ మ్యాప్ సిద్ధం చేసేందుకు వారు పర్యటించారు. హిందూపురంలో నిమజ్జనం రోజున కొట్నూరు శివారులోని జాతీయ హైవే నుంచి మడకశిర వైపుగా మళ్లించాలని ఉద్దేశంతో హైవేను పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు.


రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేష్

జాగ్రత్తలతోనే ఎయిడ్స్ నియంత్రణ

కదిరి టౌన్ : ఎయిడ్స్ నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలని జన జాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్నం పిహెచ్‌సిలో హెచ్ఐవి/ ఎయిడ్స్‌పై ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ సంక్రమణ, నివారణ మార్గాలు, మందుల గురించి తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దన్నారు. సమాచారం కోసం 1097కి ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, లక్ష్మీదేవమ్మ, పిహెచ్ఎన్, జన జాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఒఆర్‌డబ్ల్యు ప్యారి నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

లేపాక్షి : మండలంలోని గలిబిపల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కార్యకర్త రత్నమ్మ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోకపోవడం వల్ల కలిగే నష్టాలను తెలిపారు. కార్యక్రమంలో ఆయా రూపా, ప్రజలు పాల్గొన్నారు.

హాస్టల్లోకి నీరు చేరకుండా చర్యలు

పుట్టపర్తి అర్బన్ : చిన్నపాటి వర్షం కురిసినా పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలోకి నీరు చేరేది. దీంతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశాల మేరకు కమిషనర్ ప్రహ్లాద మంగళవారం వర్షం, డ్రెయినేజీ నీరు ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్‌లోకి చేరకుండా జెసిబితో కాలువల్లో పూడిక, చెత్త చెదారం తొలగింపు చర్యలు చేపట్టారు. అలాగే సమీపంలోని ఆంజనేయస్వామి, సత్తెమ్మ ఆలయాల వద్ద నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

నేరాలు ఘోరాలు

అదుపుతప్పి బైక్ బోల్తా.. వ్యక్తి మృతి

లేపాక్షి : ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో మండలంలోని మర్రిపి గ్రామానికి చెందిన రామాంజనప్ప(45) మృతి చెందాడు. వివరాలు.. రామాంజనప్ప మంగళవారం స్వంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై కంచిసముద్రం వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తుండగా కంచిసముద్రం రహదారిలో మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనం అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిన అతడిని లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ వెంకటచిరంజీవి పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య గంగరత్నమ్మ, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

తనకల్లు : మండలంలోని నారేవాండ్లపల్లి క్రాస్ వద్ద బొలెరో, సిమెంట్ ట్రక్కు ఢీకొనడంతో ఒకరు మృతి పలువురు గాయపడ్డారు. ఎస్ఐ ధరణి బాబు తెలిపిన వివరాలు.. పలువురు కూలీలు మొలకల చెరువులోని టమోటా మండికి వెళ్లి పని ముగించుకుని బొలెరో వాహనంలో స్వగ్రామం బయల్దేరారు. మార్గమధ్యలో నారేవాండ్లపల్లి మలుపు వద్ద బొలెరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి సిమెంటు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరోలో ఉన్న కొత్తపల్లి శంకరప్ప అక్కడికక్కడే మృతి చెందగా పలువురు గాయపడ్డారు. వారిని అనంతపురం, కదిరి ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ. 2 కోట్లకు పైగా మోసం కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి-కదిరి టౌన్

నల్లచెరువు మండలంలో 3 నెలల్లోనే పలువురితో పరిచయాలు పెంచుకుని వివిధ వ్యాపారాల పేరుతో నమ్మబలికి పలువురు వద్ద పెద్ద మొత్తంలో డబ్బు కాజేసిన మహా మాయగాడిని మంగళవారం కదిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కదిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ శ్రీలత విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలోని ఆర్ఎస్ కల్లూరుకు చెందిన బెస్త ఓబులేసు రక రకాల పేర్లతో పలువురితో పరిచయం పెంచుకున్నాడు. చక్కెర, సిగరెట్ల హోల్‌సెల్ వ్యాపారంలో అధిక లాభాలు ఇస్తానని నమ్మబలికి పలువురి నుంచి నగదు, బంగారు ఆభరణాలు ఇప్పించుకొని మకాం మార్చేవాడు. ఇతడిని డీఎస్పీ శ్రీలత పర్యవేక్షణలో రూరల్ సిఐ నాగేంద్ర ఆధ్వర్యంలో నిందితుడు ఓబులేశు అలియాస్ మహేశ్వరరెడ్డి అలియాస్ మనోహర్‌రెడ్డి అలియాస్ ఛత్రపతి అలియాస్ సుబ్రమణ్యంశెట్టిని నల్లచెరువు మండల శివారులోని చక్రపాణి డాబా వద్ద అరెస్ట్ చేసి విచారించారు. 4 నెలల క్రితం నార్పల మండలంలోని కర్ణపుడికి గ్రామానికి చెందిన శివ, బెస్త శీన అలియాస్ రమణతో కలిసి ముఠాగా ఏర్పడి నల్లచెరువులో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని, అందులో ఆఫీస్ ఏర్పాటు చేసి పెద్దఎత్తున హోల్‌సేల్ చక్కెర, సిగరెట్ వ్యాపారాలు చేసే వారిగా ప్రజలను నమ్మించారు. తమ వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని చెప్పి కొందరి చేత డబ్బులు తీసుకుని వారికి కొద్దిరోజులు పెద్దమొత్తంలో డబ్బు చెల్లించారు. ఇలా చాలా మందిని నమ్మించి రూ. 2 కోట్లకు పైగా వసూలు చేసుకుని గత జులై 23వ తేదీ ఉన్న ఫళంగా అక్కడి నుంచి ఉడాయించినట్లు తెలిపారు. వీరిపై గతంలో ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు, గోదావరి జిల్లాల్లో 24 చీటింగ్, చోరీ కేసులు ఉన్నాయన్నారు. నిందితుడి భార్య, మేనమామపై కూడా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.


పేకాట జూదరులు అరెస్టు

మడకశిర : రూరల్ సిఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి పలువురిని అరెస్టు చేశారు. రాజునాయక్, రమేష్‌నాయక్, మంజునాథ్, శివన్న, నగేష్, హనుమాన్‌తో పాటు పలువురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 55,400 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో 11మంది పరారయ్యారని తెలిపారు. మండలంలో పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

బాలిక కనిపించలేదని ఫిర్యాదు

నల్లచెరువు : మండలంలోని బండ్రేపల్లి గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి కుమార్తె జి.నందినిరెడ్డి కడప జిల్లాలోని కెఎంఎల్‌డబ్ల్యు కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతోంది. గత నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు స్వగ్రామం వస్తున్నానని తండ్రికి ఫోన్ ద్వారా చెప్పి కాలేజీ నుంచి బయల్దేరింది. అయితే ఆమె ఇంటికి రాలేదని, వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఓబుళరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ నెంబర్ 9490922418, కదిరి రూరల్ సిఐ నెంబర్ 9440796853కు సమాచారం ఇవ్వాలని కోరారు.

టిడిపి నేతల మృతికి నివాళి


పివి చౌదరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు : మాజీ ఎంపిపి పివి చౌదరి అనారోగ్యంతో అనంతపురం నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు నిర్వహించడానికి కొత్తచెరువులోని వారి ఇంటికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి చౌదరి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఆలం నర్సానాయుడు, తలారి ఆదినారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పాము చిన్న అక్కులప్ప మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి అక్కులప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కులప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నల్లచెరువు : మండలంలోని దేవరింటిపల్లిలో టిడిపి సీనియర్ నాయకులు జీర్లకుంట చాకలి వెంకటరమణ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మండల కన్వీనర్ రాజశేఖర్‌తో పాటు పలువురు నాయకులు వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళుర్పించిన వారిలో నాయకులు మహబూబ్‌సాబ్, నాగభూషణ్ నాయుడు, అబ్దుల్ ఖాదర్, అంజనప్ప, బేకరీ నాగరాజ్, తెలుగు యువత అధ్యక్షుడు ప్రసాద్, ఆంజనేయదాస్, మహమ్మద్ షాకీర్, పఠాన్, బాబ్జాన్, షేక్ బాబాఫకృద్దీన్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేసిన జనసేన పార్టీ నాయకులు

రొద్దం : మండలంలోని కలిపి, కలిపి ఎస్సీ కాలనీలో ఉన్న ఎంఎయుపి పాఠశాలలో మంగళవారం జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అభిమానులు 500 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్ గణేష్, పవన్‌కళ్యాణ్ అభిమానులు రఘు, గంగాధర్, గోపాల్, వెంకటేష్, పూజన్న, మూర్తి, బాలు, నారాయణ, మహమ్మద్, వెంకీ, ఓబులేష్ పాల్గొన్నారు.

వడ్డిపేటలో దుస్తులు

ముదిగుబ్బ : స్థానిక వడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, గోవిందమ్మ దంపతులు 40మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. తమ మనవరాలు బాసినేని కృషిక జన్మదినం సందర్భంగా విద్యార్థులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహులు, ఉపాధ్యాయులు వెంకటనాయుడు, రామాంజనేయులు, అల్లీపీరా, శ్రీనివాసులు, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.